




సిద్ధం చేస్తున్న హెలిప్యాడ్

నేడే ప్రజాగళం

- క్రోసూరు, సత్తెనపల్లిలో సభలు
- చంద్రబాబు పర్యటనకు భారీ ఏర్పాట్లు
- నేడు టీడీపీలో చేరనున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

నరసరావుపేట, క్రోసూరు, ఏప్రిల్ 5: ఎన్నికల శంఖారావం పూరించేందుకు శనివారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పల్నాడులో అడుగుపెట్టనున్నారు. పెదకూరపాడు, సత్తెనపల్లి నియోజకవర్గాలో జరిగే ప్రజాగళం సభలు, రోడ్‌షోల్లో టీడీపీ అధినేత పాల్గొననున్నారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు చంద్రబాబు పర్యటనకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పసుపు తోరణాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలతో చంద్రబాబు పర్యటన ప్రాంతాలను టీడీపీ నాయకులు అలంకరించారు. క్రోసూరు, సత్తెనపల్లిలో ప్రజాగళం బహిరంగ సభలకు ఏర్పాట్లు చేశారు. క్రోసూరు ఎన్టీఆర్ సెంటర్‌లో జరిగే సభ ఏర్పాట్లను పెదకూరపాడు అభ్యర్థి భాష్యం ప్రవీణ్ పర్యవేక్షిస్తున్నారు. క్రోసూరులోని పశువుల ఆస్పత్రి వెనుక ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి ప్రధాన రహదారి వరకు చంద్రబాబు ప్రయాణించే వాహనం రావడానికి వీలుగా ప్రత్యేకంగా రోడ్డును నిర్మించారు. క్రోసూరులో సభ అనంతరం ఎర్రబాలెం, పీసపాడు, రెంటపాళ్ల వరకు మోటారు బైక్‌లతో ర్యాలీ ఉంటుందని భాష్యం ప్రవీణ్ తెలిపారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల నుంచి చంద్రబాబుకు ఘనంగా స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి. సత్తెనపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో జరిగే ప్రజాగళం సభ ఏర్పాట్లను టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పర్యవేక్షిస్తున్నారు. ప్రజాగళం విజయవంతంపై విస్తృత ప్రచారం చేశారు. సత్తెనపల్లిలోని 11, 12వ వార్డుల్లో తెలుగు మహిళలు ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి మహిళలను ఆహ్వానించారు. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తన అనుచరులతో కలిసి సత్తెనపల్లిలో జరిగే సభలో చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోనున్నారు. ఆయన గురజాల నుంచి భారీ ర్యాలీగా సత్తెనపల్లికి వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆయా సభలకు ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, పార్టీ అభ్యర్థులు కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్, యరపతినేని శ్రీనివాసరావు, జీవీ ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు, జూలకంటి బ్రహ్మారెడ్డి, డాక్టర్ చదలవాడ అరవిందబాబులతో పాటు కోడెల శివరాం, జనసేన, బీజేపీ, టీడీపీ ముఖ్య నేతలు హాజరు కానున్నారు.



సభకు రావాలని మహిళలకు బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న తెలుగు మహిళలు

ప్రజాగళం షెడ్యూల్..

చంద్రబాబు శుక్రవారం మధ్యాహ్నం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నుంచి హెలికాప్టర్‌లో 2.55 గంటలకు క్రోసూరుకు చేరుకుంటారు. పశువుల ఆస్పత్రి సెంటర్‌లోని హెలిప్యాడ్ నుంచి 3.10 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. సభలో చంద్రబాబు ప్రసంగిస్తారు. 5.15 గంటలకు వేదిక నుంచి కారులో సత్తెనపల్లిలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌కు 6 గంటలకు చేరుకుంటారు. అక్కడ సభలో ప్రసంగిస్తారు. అనంతరం రాత్రి బస కోసం వెంకటేశ్వర గ్రాండ్ కల్యాణ మండపానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో నియోజకవర్గాల వారీగా ఎన్నికల తీరుపై చంద్రబాబు సమీక్షించనున్నారు.

ఫైర్..డే

- భానుడి భగభగ
- 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- సాధారణం కన్నా 10 డిగ్రీలు అధికం
- ఉమ్మడి జిల్లా అంతటా సూర్య ప్రతాపం

ఉష్ణోగ్రత డిగ్రీలలో..

రెంటచింతల	45
మాచర్ల	45
వినుకొండ	45
గురజాల	45
దాచేపల్లి	45
నరసరావుపేట	44
పిడుగురాళ్ళ	44
వినుకొండ	43
సత్తెనపల్లి	43
చిలకలూరిపేట	43

నరసరావుపేట, రెంటచింతల, ఏప్రిల్ 5: భానుడు భగభగలతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ నెల ఆరంభంలోనే 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మే నెలను తలపించే రీతిలో ఎండలు ఉన్నాయి. 9 గంటల నుంచి వేడి తీవ్రత కనిపిస్తోంది. రానున్న వారం రోజులు ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. ఇప్పుడే ఎండ తీవ్రత ఈ స్థాయిలో ఉంటే మేలో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయాందోళనల్లో ప్రజలున్నారు. ఎండ వేడిమి, ఉక్కపోతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇళ్లలో నుంచి బయటకు వచ్చే సాహసం చేయడంలేదు. అత్యవసర పనులకు మాత్రమే బయటకు వస్తున్నారు. గత ఏడాది ఇదే రోజున 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాధారణం కన్నా 10 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రత నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. రెంటచింతల, నరసరావుపేట ప్రాంతాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక ఎండకు పేరుగాంచిన రెంటచింతలలో శుక్రవారం అత్యధిక పగటి ఉష్ణోగ్రత 43.5 డిగ్రీలుగా నమోదైనట్లు జంగమహేశ్వరపురం వాతావరణ కేంద్రం పీటీవో భానుప్రసాద్ చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఇదే ఎక్కువన్నారు. గాలిలో తేమ శాతం తగ్గిపోవడంతో ఎండ తీవ్రత ఎక్కువైంది. నిత్యం వందల మందితో కోలాహలంగా కనిపించే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు ప్రధాన రహదారులు ఉదయం పదిగంటలకే నిర్మానుష్యంగా మారాయి.



నిర్మానుష్యంగా నరసరావుపేటలోని పల్నాడు రోడ్డు

జాగ్రత్తలు అవసరం..

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో కనీస జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. ఎండలో బయటకు వెళ్లే వారు రక్షణగా గొడుగు వాడితే మంచిదంటున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల్లోపు సాధ్యమైనంత వరకు ఇంటి నుంచి బయటకు రాకూడదని హెచ్చరిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే ముక్కు, చెవులకు వస్త్రం చుట్టుకోవడం మంచిది. చిన్నారులు, వృద్ధులు అత్యవసర మైతే తప్ప బయటకు రావద్దని, క్షేత్రస్థాయిలో పనిచేసే వారు తగిన జాగ్రత్త పాటించాలని చెబుతున్నారు. నీటిని ఎక్కువగా తాగాలని, మజ్జిగ కొబ్బరి నీళ్ల పండ్ల రసాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ద్విచక్రవాహనంపై ఎక్కువ దూరం ప్రయాణించడం అంత మంచిది కాదని హెచ్చరిస్తున్నారు.



నిర్మానుష్యంగా రెంటచింతల ప్రధాన రహదారి

ఉపాధ్యాయ సంఘాల.. నేతలకు ఎర!



- ఓట్ల కోసం అధికార పార్టీ ఉపాధ్యాయులకు ఆత్మీయ గాలం
- ఆత్మీయ సమావేశాల పేరుతో భారీ నజరానాలు
- పల్నాడులో ఓ సంఘానికి 10 సెంట్ల స్థలం కేటాయింపు
- భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, జిల్లా అత్యున్నత అధికారి
- గుంటూరు జిల్లాలో ఓ ఎమ్మెల్యే రూ. 5లక్షలు నిధులు
- సంఘం ముసుగులో ఎన్నికల్లో పాల్గొనే ఉపాధ్యాయుల జాబితా సేకరణ
- ఉపాధ్యాయుల సమాచారం అధికార పార్టీ గుప్పిట్లోకి..

గుంటూరు(విద్య), ఏప్రిల్5: ఇప్పటి వరకు ఉపాధ్యాయుల్ని పూచిక పుల్లతో సమానంగా చూసిన అధికార పార్టీ నేతలు ఓట్ల కోసం కొత్త నాటకం ప్రారంభించారు. రహస్యంగా ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తూ నజరానాలు, నోట్లతో ఎరవేస్తున్నారు. సంఘాలకు చెందిన ప్రధాన నాయకులకు ఇప్పటికే భారీమొత్తంలో ముట్ట చెప్పినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో రోజు ఏదో ఒక చోట ఉపాధ్యాయులు, సంఘాల నేతలతో ద్వితీయ, తృతీయ శ్రేణి నేతలు ఆత్మీయ సమావేశాలు పెడుతున్నారు. మరోవైపు ఎన్నికల ముందే రహస్యంగా ఓ సంఘానికి 10 సెంట్ల స్థలం కేటాయించడం దీని భూమి పూజ కోసం జిల్లా అత్యున్నత అధికారి, ఎమ్మెల్యే రావడం, ఆ సంఘం ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయుల జాబితాను అధికారపార్టీ నేతల చేతుల్లో పెట్టడం వంటి ఘటనలు ఉమ్మడి జిల్లాలో కలకలం సృష్టిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో దాదాపు ప్రభుత్వ, జడ్పీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు 16వేల మందికిపైగా ఉన్నారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో ఉపాధ్యాయులకు ప్రభుత్వం చేసింది ఏమీ లేకపోగా యాప్‌ల పేరుతో నిత్యం వేధింపులకు గురిచేసింది. ఇప్పటికే సంఘాల నాయకులపై అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనికితోడు ముఖ్య కార్యదర్శి హోదాలో పాఠశాలల్లో ప్రవీణ్‌ప్రకాశ్ చేసిన హడావిడి, ఉపాధ్యాయులతో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన తీరు తెలిసిందే. దీంతో ఉపాధ్యాయుల్లో దాదాపు 90శాతంపైగా ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈనేపథ్యంలో వారిని మంచి చేసుకునేందుకు పార్టీ నాయకులు రంగంలోకి దిగారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో సంఘాలకు చెందిన ప్రధాన నాయకులను ఎమ్మెల్యేలు కలవకుండా ద్వితీయ శ్రేణి నేతలతో రహస్యంగా ఫోన్‌లోనే టచ్‌లోకి వస్తున్నారు. ప్రభుత్వంపై ఉన్న కోపం స్థానికంగా మా మీద చూపవద్దని ఈసారి తమకే ఓట్లు వేయాలని ఎమ్మెల్యేల చేత సంఘాల నాయకులకు ఫోన్ చేయిస్తున్నారు. జిల్లాలో ఓ సంఘానికి ఓ ఎమ్మెల్యే అభ్యర్థి రూ. 5లక్షల వరకు నిధులు సమకూర్చారు. ఈ సంఘానికి చెందిన రాష్ట్రస్థాయి మాజీ నేతకు ఈ మొత్తం అందినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో గతంలో ప్రభుత్వంపై బహిరంగానే విరుచుకుపడే ఈ నేత ఇప్పుడు పెద్దగా స్పందించడం లేదు. ఈ సంఘం నాయకులు ఉమ్మడి జిల్లాలో ప్రతి నియోజకవర్గం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో టచ్‌లో ఉంటూ లక్షల్లో సంఘానికి నిధులు సమకూర్చేపనిలో ఉన్నారు. పల్నాడు జిల్లాలో ఎన్నికల నోటిఫికేషన్ జారీకి ముందు ప్రభుత్వానికి చెందిన రూ.లక్షల విలువైన 10సెంట్ల స్థలాన్ని ఎటువంటి ఉత్తర్వులు లేకుండా ఓ సంఘానికి కట్టబెట్టారు. పల్నాడులో విద్యాశాఖకు చెందిన ఉన్నత అధికారి ఒకరు ఎన్నికల సెల్ పేరుతో కార్యాలయంలో అనధికారికంగా ఓ విభాగం ప్రారంభించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయుల జాబితాలు ఎప్పటికప్పుడు పార్టీ నాయకులకు చేరవేసే పనిలో ఆయన నిమగ్నమై ఉన్నట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయుల జాబితాను కొన్ని సంఘాలు రహస్యంగా సేకరించినట్లు సమాచారం. దీనిని అధికారి పార్టీ నేతలకు చేరవేసి భారీ స్థాయిలో లబ్ధి పొందుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. బాపట్ల జిల్లాలో సైతం ఓ రెండు సంఘాలు అనధికారికంగా అధికార పార్టీ సేవలో తరిస్తున్నాయి.



బాబుజగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా అధికారులతో కలిసి ఆయన చిత్ర పటానికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా పుష్పాంజలి ఘటించారు. ఎస్సీల సంక్షేమం, కార్మికుల అభ్యున్నతికి బాబుజగ్జీవన్‌రాం విశేష కృషి చేశారని కీర్తించారు.

కాడిపడేస్తోన్న ఇన్‌చార్జిలు



- తాడేపల్లి పెద్దల వద్ద కొందరి పంచాయితీ
- ఈసీ చర్యలతో అధికార దుర్వినియోగంపైనా ఆశలు గల్లంతు
- వైసీపీ నుంచి టీడీపీలోకి పెద్ద ఎత్తున చేరికలు

బాపట్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పాలకపార్టీ పరిస్థితి జిల్లాలో రోజురోజుకూ దిగజారుతోంది. అధికార దుర్వినియోగంపైనే ఆశలు పెట్టుకున్న వైసీపీకి ఎన్నికల కమిషన్ ఇచ్చే షాకులతో తలబొప్పికడుతోంది. మరోవైపు వైసీపీ ద్వితీయశ్రేణి నేతలతో పాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున టీడీపీలోకి చేరుతున్నారు. ఈ చేరికలను ఆపడానికి వైసీపీ నేతలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడంలేదు. ఇక పలు నియోజకవర్గాల్లో ఇన్‌చార్జిలకు మాజీల నుంచి సహకారం అందడంలేదు. దీంతో గెలుపుపై ఉన్న దింపుడు కళ్లం ఆశలు ఆవిరైపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో కొందరు ఇన్‌చార్జిలు కాడి పడేయడానికి సిద్ధమైనట్లు సమాచారం. అంతేగాక తాము బరిలోనే ఉండమని అధిష్ఠానానికే తేల్చిచెప్పిట్లు సమాచారం. ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా కేవలం వ్యవస్థల దుర్వినియోగంతో ఎన్నికల గండం గట్టెక్కుతామనే ధీమా నిన్నమొన్నటి వరకు వైసీపీ నేతల్లో ఉంది. అయితే ఎన్నికల కమిషన్ కొరడా ఝుళిపిస్తుండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అధికారపార్టీ నేతల సేవలో తరించిన అధికారులు కూడా చేతులెత్తేశారు. పార్టీ పదవుల్లో ఉన్న వారితో పాటు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు కూడా టీడీపీ బాట పడుతున్నారు. మార్టూరుకు చెందిన వైసీపీ నేతలు టీడీపీలో చేరే క్రమంలో వారిని ఆపడానికి ఇన్‌చార్జి చేసిన ప్రయత్నాలు పాలక పార్టీ దీనావస్థకు అద్దం పడుతున్నాయి. గడచిన నెల రోజుల వ్యవధిలో వైసీపీలో కీలకంగా వ్యవహరించే ద్వితీయశ్రేణి నేతలు దాదాపు 250 మంది టీడీపీలో చేరారు. జిల్లాలోని ఓ నియోజకవర్గ వైసీపీ నూతన ఇన్‌చార్జి తాజాగా జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డిని తాడేపల్లిలో కలిసి తాను పోటీ చేయలేనని తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. ఈ మాటలతో కంగుతిన్న కో ఆర్డినేటర్ సదరు నేతకు సర్దిచెప్పి నియోజకవర్గానికి పంపించినట్లు సమాచారం. మరో నేత వెళ్లి మాజీ ఇన్‌చార్జి నుంచి తనకు సహకారం అందడం లేదని, ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకుంటానని తాడేపల్లి పెద్దల ముందు వాపోయారు. మాజీ ఇన్‌చార్జిని పిలిపించి ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చి పంపించినట్లు తెలుస్తోంది. ఇలాంటి పంచాయితీయే గతంలోనూ జరగ్గా అధిష్ఠానం ముందు సరేనన డం, నియోజకవర్గంలో మాత్రం అసమ్మతి బావుటా ఎగురవేయడం జరుగుతూ వస్తోంది.

నేతలతో సమావేశంతో సరి..

తాజాగా వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి జిల్లా పర్యటనకు వచ్చారు. ముందే నిర్ణయించుకున్న షెడ్యూల్ ప్రకారం రేపల్లె, బాపట్ల, వేమూరులో ద్వితీయ శ్రేణినేతలతో ఆయన సమీక్ష చేయాలి. అయితే వారి నుంచి నిరసనలు ఎదురవుతాయనే భయంతో ఎంపిక చేసిన కొంతమంది నాయకులతో మొక్కుబడిగా సమావేశంతో సరిపెట్టారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ కో ఆర్డినేటర్ తమ నియోజకవర్గానికి వచ్చి కలవకుండా వెళ్లడంపై నాయకులు మండిపడుతున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(శనివారం)

సహారీ (ఉదయం) 4.42 (ఆదివారం)

పర్చూరు.. ప్రత్యేకం

- రాజకీయ చైతన్యానికి ప్రతీక
- ఉద్దండులు పోటీ చేసిన నేలగా ప్రసిద్ధి

మొత్తం ఓటర్లు : 2,25,770

పురుషులు: 1,10,256

స్త్రీలు : 1,15,508

ఇతరులు : 6



నియోజకవర్గ ముఖచిత్రం

రాజకీయ చైతన్యానికి ప్రతీక.. ఉత్కంఠ పోరుకు కేంద్రం.. ఉద్దండులు పోటీ చేసిన ప్రాంతం.. ఇలా ఎన్నో ప్రత్యేకతలను పర్చూరు నియోజకవర్గానికి ఉన్నాయి. రాష్ట్రస్థాయిలో విశిష్టతను సంతరించు కున్న పర్చూరు నియోజకవర్గం నూతనంగా ఏర్పాటైన బాపట్ల జిల్లాలో ఒకటిగా ఉంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో గతంలో ఉన్న ఈ నియోజకవర్గం 1955లో ఏర్పాటైంది. పర్చూరులో ఇప్పటికి పది హేను సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా కాంగ్రెస్ ఏడు సార్లు, టీడీపీ ఆరు సార్లు, సీపీఎం ఒకసారి, స్వతంత్ర అభ్యర్థి ఒకసారి ఎన్నికయ్యారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడి నుంచి టీడీపీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, వైసీపీ తరపున యడం బాలాజీ బరిలో ఉన్నారు.

పర్చూరు, ఏప్రిల్ 5: పర్చూరు నియోజకవర్గం ఆది నుంచి కమ్యూనిస్టుల కోటగా ఉండేది. అయితే తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత కమ్యూనిస్టుల ప్రాభవం తగ్గిపోయింది. తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు నెగ్గుతూ వచ్చాయి. ఇక్కడ నెగ్గి మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. ఆయన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు అల్లుడిగా, నారా చంద్రబాబు నాయుడికి తోడల్లుడిగా రాష్ట్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషించారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం మండలాలు ఉన్నాయి.



నెహ్రూ మెచ్చిన కొల్లా రామయ్య..

పర్చూరు మండల పరిధిలోని నాగులపాలేనికి చెందిన 19 ఏళ్ల ప్రాయంలో కొల్లా రామయ్య భారత జాతీయ కాంగ్రెస్ తరపున పోటీచేసి కమ్యూనిస్టు యోధుడు కొల్లా వెంకయ్యను ఓడించారు. కమ్యూనిస్టు ప్రభావం ఉన్న తరుణంలో అంతటి ఉద్దండుని ఓడించిన కొల్లా దేశ రాజకీయాల్లో సంచలనంగా మారారు. అప్పటి ప్రధానిగా ఉన్న నెహ్రూ కొల్లా రామయ్యను ప్రత్యేకంగా అభినందించారు.

తొలి మహిళా ఎమ్మెల్యే లక్ష్మీపద్మావతి

పర్చూరు నియోజకవర్గంలో 1999 సాధారణ ఎన్నికల్లో నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు జాగర్లమూడి పద్మావతి టీడీపీ తరపున పోటీచేసి విజయం సాధించారు. దీంతో ఆమె నియోజకవర్గంలో తొలి మహిళా ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. దీంతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో తొలి మహిళా మంత్రిగా మరో గుర్తింపు పొంది పర్చూరు ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో చాటారు.

సంవత్సరం	విజేత	పార్టీ	ఓటమి	పార్టీ	మెజార్టీ
1955	కొల్లా రామయ్య	కాంగ్రెస్	కొల్లా వెంకయ్య	సీపీఐ	5,501
1962	ఎన్. వెంకటస్వామి	సీపీఐ	ఎం. నారాయణరావు	కాంగ్రెస్	8,057
1967	గాదె వెంకటరెడ్డి	కాంగ్రెస్	ఎన్ వెంకటస్వామి	సీపీఐ(ఎం)	10,427
1972	ఎం. నారాయణరావు	స్వతంత్రం	గాదె వెంకటరెడ్డి	కాంగ్రెస్	310
1978	ఎం నారాయణరావు	కాంగ్రెస్(ఐ)	గాదె వెంకటరెడ్డి	జనతా	4,937
1983	దగ్గుబాటి చౌదరి	టీడీపీ	గాదె వెంకటరెడ్డి	కాంగ్రెస్	6,614
1985	దగ్గుబాటి వెంకటేశ్వరావు	టీడీపీ	గాదె వెంకటరెడ్డి	కాంగ్రెస్	1,077
1989	దగ్గుబాటి వెంకటేశ్వరరావు	టీడీపీ	గాదె వెంకటరెడ్డి	స్వతంత్రం	6,828
1991	గాదె వెంకటరెడ్డి	కాంగ్రెస్	దామచర్ల ఆంజనేయులు	టీడీపీ	10,427
1994	గాదె వెంకటరెడ్డి	కాంగ్రెస్	బత్తుల బ్రహ్మారెడ్డి	టీడీపీ	2,202
1999	జాగర్లమూడి లక్ష్మీపద్మావతి	టీడీపీ	గాదె వెంకటరెడ్డి	కాంగ్రెస్	2,209
2004	దగ్గుబాటి వెంకటేశ్వరరావు	కాంగ్రెస్	బాచిన చెంచుగరటయ్య	టీడీపీ	15,546
2009	దగ్గుబాటి వెంకటేశ్వరరావు	కాంగ్రెస్	గొట్టిపాటి నరసింహారావు	టీడీపీ	2,960
2014	ఏలూరి సాంబశివరావు	టీడీపీ	గొట్టిపాటి భరత్ కుమార్	వైసీపీ	10,775
2019	ఏలూరి సాంబశివరావు	టీడీపీ	దగ్గుబాటి వెంకటేశ్వరరావు	వైసీపీ	1,647

నియోజక వర్గంలో సామాజిక వర్గాల ఓట్లు

కమ్మ	50,000
మాల	28,955
మాదిగ	20,537
కాపులు	21000
ముస్లీం	20300
రెడ్డి	18000
యాదవ	11200
వడ్డెర	8470
రజక	6610
వైశ్య	5652
జాలరి	4863
ఎరుకుల	3619
యానాది	3562
కుమ్మరి	2785
పద్మశాలీలు	2175
నాయీబ్రాహ్మణ	1915
గౌడ	1588
విశ్వబ్రాహ్మిణ్	1585
క్షత్రియ	1415
బ్రాహ్మిణ్	1375
నాయిక్	1311
నూర్‌బాషాలు	944
జంగాలు	940
వాల్మీకిబోయ	863
చెంచులు	660
ముదిరాజులు	500
ఇతరులు	4,972



తుళ్లూరులో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

అమరావతి అభివృద్ధిని కాంక్షించేవారిని గెలిపించాలి

- విచ్ఛిన్నం చేసే వారిని ఇంటికి పంపాలి
- 1571వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

తుళ్ళూరు, ఏప్రిల్ 5: అమరావతి అభివృద్ధిని కాంక్షించేవారిని గెలిపించి రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవాలని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1571వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాలు, గృహాల నుంచి నిరసన దీక్షలు చేస్తున్న మహిళలు, రైతులు మాట్లాడుతూ, అమరావతి విచ్ఛిన్నం చేయాలనుకున్న వారిని ఇంటికి పంపాలని విజ్ఞప్తి చేశారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం అమరావతి అభివృద్ధి చెందితే యువతకు బంగారు భవిషత్ ఉండేదన్నారు. మూడు రాజధానలంటూ అమరావతిని నిర్వీర్యం చేసిన వైసీపీ పాలకులను శాశ్వతంగా ఇంటికి పరమితం చేయాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

నేడు టీడీపీలోకి ఎమ్మెల్సీ జంగా

- వున్నంతో పాటు మరికొందరు



జంగా కృష్ణమూర్తి

పిడుగురాళ్ల, ఏప్రిల్ 5: వైసీపీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి టీడీపీలో చేరనున్నారు. శనివారం సత్తెనపల్లిలో జరగనున్న ప్రజాగళం సభలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడి సమక్షంలో ఆయన పసుపు కండువా కప్పుకోనున్నారు. జంగా కృష్ణమూర్తితో పాటు పిడుగురాళ్లకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ వున్నం నరసింహారావు, ఆయన తనయుడు డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, దాచేపల్లి మాజీ ఎంపీపీ భూషణం చెన్నయ్య, మాశెట్టి పుల్లారావుతో పాటు మరికొందరు నేతలు కూడా నేడు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు. బీసీల్లో మంచి పట్టున్న జంగా కృష్ణమూర్తి తెలుగుదేశం పార్టీలో చేరడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు కోస్తా జిల్లాల్లోనూ ఆ ప్రభావం పడే అవకాశం వుంది. 1999 నుంచి 2019 వరకు చిరకాల ప్రత్యర్థులుగా వున్న గురజాల మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఎట్టకేలకు ఒకేతాటిపైకి రావడం ఇక్కడ హాట్ టాపిక్‌గా మారింది. 2024 ఎన్నికల్లో ఇరువురు తెలుగుదేశం పార్టీ గెలుపుకోసం పాటుపడేందుకు ఒకే వేదికపైకి వచ్చారు. జంగా కొద్దిరోజుల క్రితమే టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

- కన్నా లక్ష్మీనారాయణ



నకరికల్లులో టీడీపీలో చేరిన వారితో కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

నకరికల్లు, ఏప్రిల్ 5: గోదావరి-పెన్నా నదుల అనుసంధానం, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయటం, ఆంధ్రప్రదేశ్ రాజధానిని నిర్మించటం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకే సాధ్యమని నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం రాత్రి నకరికల్లు టీడీపీ కార్యాలయంలో నకరికల్లుకు చెందిన ఎస్సీ ఎస్టీ, బీసీ సామాజికవర్గాలకు చెందిన వైసీపీలోని 225 కుటుంబాలు టీడీపీలో చేరారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పార్టీలో చేరినవారికి పార్టీ కండువాలు కప్పిఆహ్వానించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ ప్రజలంతా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించటానికి సంసిద్ధంగా ఉన్నారన్నారు. రాజధాని నిర్మాణం చేసి ఇక్కడే సంపదను సృష్టించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టీడీపీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నాదెండ్ల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సాగి కోటేశ్వరరావు, పార్టీ పరిశీలకులు ముక్కపాటి రామచంద్రరావు, జనసేన మండల ఉపాధ్యక్షుడు బత్తిన శ్రీనివాసరావు, బీజేపీ నేతలు షేక్ మున్వర్‌బాజీ, పాలడుగు శ్రీనివాసరావు, తిరుమలశెట్టి వెంకటరావు, ఢీకొండ మహానంది, కాసా సాంబయ్య, భవనాసి కిషోర్, దూదేకుల హుస్సేన్‌బీ, అట్లూరి పుల్లమ్మ పాల్గొన్నారు.

తాడిశెట్టి చేరికతో టీడీపీ మరింత బలోపేతం

- గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్
- టీడీపీ గెలుపునకు అహర్నిశలు పని చేస్తాం :తాడిశెట్టి మురళి
- పెమ్మసాని సారథ్యంలో భారీగా ర్యాలీతో తరలివెళ్లిన మురళి, ఆయన అనుచర గణం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 5: తాడిశెట్టి సోదరుల చేరికతో జిల్లాలో టీడీపీ మరింత బలోపేతమైందని గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. నగర మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళి, అమల దంపతులు వైసీపీని వీడి టీడీపీలోకి చేరుతున్న సందర్భంగా స్థానిక ఆర్టీవో కార్యాలయం, శిల్పారామం వద్ద ఏర్పాటు చేసిన అభిమానుల ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాడిశెట్టి మురళి మోహన్ టీడీపీలోకి రావడం శుభసూచకమన్నారు. మురళి రాకతో జిల్లాలో కూటమి గెలుపు తేలికైందన్నారు. శక్తివంతమైన తాడిశెట్టి సోదరులకు టీడీపీలో కీలకమైన బాధ్యతలను త్వరలోనే అప్పజెప్తామని హామీ ఇచ్చారు.

వైసీపీ ఓటమే లక్ష్యంగా పనిచేస్తాం: తాడిశెట్టి మురళి

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను తీవ్రంగా మోసంచేసిన వైసీపీ ఓటమే లక్ష్యంగా పనిచేస్తామని తాడిశెట్టి మురళి స్పష్టం చేశారు. టీడీపీలోకి చేరే ముందు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి నేతి బీరకాయ చందంగా మారిందని విమర్శించారు. ఐదేళ్లలో అన్ని రంగాలను జగన్ నాశనం చేసారని విమర్శించారు. ముఖ్యంగా బీ సీలకు న్యాయం జరుగుతుందనే నమ్మకంతో వైసీపీలో కొనసాగానని, అక్కడ అటువంటి పరిస్థితులు లేవనే అందుకే అ పార్టీని వీడుతున్నట్టు వివరించారు. అమరావతి అభివృద్ధి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. జిల్లాలో ఒక్క పార్లమెంట్, ఏడు నియోజకవర్గాలను కూటమి క్లీన్ స్వీప్ చేయబోతున్నట్టు ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే జిల్లాలో వైసీపీ ఖాళీ అవుతున్నట్టు స్పష్టం చేశారు.

పెమ్మసాని సారథ్యంలో భారీగా ర్యాలీతో తరలివెళ్లిన తాడిశెట్టి మురళి

అంతకుముందు నగరంలో తాడిశెట్టి అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టాభిపురంలోని తాడిశెట్టి మురళి నివాసం నుంచి ఆర్టీవో కార్యాలయం, శిల్పారామం వరకు భారీవాహనాలతో వేలాదిమంది కార్యకర్తలతో ర్యాలీ జరిగింది. అనంతరం ఉండవల్లి, చంద్రబాబు నాయుడు ఇంటివరకు ఏర్పాటుచేసిన ర్యాలీని పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. వేలాదిమంది కార్యకర్తలతో తాడిశెట్టి మురళి, దంపతులు తరలివెళ్లారు. తాడిశెట్టి మురళితో పాటు గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జీ కోవెలమూడి రవీంద్ర. తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు అభ్యర్థులు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, టీడీపీ నేతలు రావిపాటి సాయి, చిట్టాబత్తిని చిట్టిబాబు, తాడిశెట్టి మిత్రులు సోమేపల్లి శివప్రసాద్, వక్కలగడ్డ రామకృష్ణ తదితరులు ఉన్నారు.



లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తాడిశెట్టి మురళి, అమల దంపతులు, పక్కన పెమ్మసాని

యువనేత లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన వారు వీరే....

తాడిశెట్టి కుటుంబీకులతో పాటు టీడీపీలో చేరినవారిలో కార్పొరేటర్ మల్లిబోయిన శ్రీవల్లి (52వ డివిజన్) మాజీ జడ్పీటీసీ భూపతి శ్రీనివాసరావు, జయరామ్ నాయుడు, మాజీ కార్పొరేటర్లు అడపా కాశీవిశ్వనాథం, సంబరాల వాసు, వంజరపు రత్నకుమారి, రేఖా ఉమామహేశ్వరి, ఇంకొల్లు శంకర్ రావు, రెడ్డిపాలెం సర్పంచ్ బుజ్జి (రెడ్డిపాలెం), మాజీ సర్పంచ్‌లు యర్రంశెట్టి వేణుగోపాల్, చింతా సుబ్బారావు, ఎలిమినేటి వెంకటేశ్వర్లు, మోడావత్ శ్రీనునాయక్, మాజీ ఎంపీటీసీలు మల్లెంపాటి శేషగిరిరావు, వేల్పూరి వెంకటస్వామి, వైసీపీ రాష్ట్ర నాయకులు చంగలశెట్టి సత్యనారాయణ, చింతల దేవి, సుబ్బారావు (రెడ్డిపాలెం), బీసీ నాయకులు, విన్నకోట శంకర్, విన్నకోట మధు, కొండెబోయిన శ్రీనివాసరావు, ఎస్టీ నాయకుడు పరసా కోటేశ్వరరావు, మార్కెట్ యార్డు డైరక్టర్ తాళ్ల నాగరాజు, ప్రముఖ నాయకులు ఈదర సాయిప్రసాద్ చౌదరి, ఐలా శ్రీనివాసరావు (పాతగుంటూరు), మంగళగిరి చేనేత నాయకులు కానుగుల రవి, కాపు నాయకుడు నామాల శశిధర్, ఆర్యవైశ్య ప్రముఖులు వెచ్చా కృష్ణమూర్తి, నగర నాయకులు రెడ్డి వీరస్వామి తదితరులు ఉన్నారు.

ప్రభావశీల నేత బాబు జగ్జీవన్‌రామ్

- జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో డాక్టర్ పెమ్మసాని



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పెమ్మసాని

గుంటూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అణగారినవర్గాల పట్ల వున్న వ్యత్యాసాలు, అడ్డంకులను లెక్కచేయకుండా తన గళాన్ని బలంగా వినిపించిన నాయకుడు బాబు జగ్జీవన్‌రామ్ అని గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా గుంటూరులోని పట్టాభిపురం, మార్కెట్ సెంటర్లలోని ఆయన విగ్రహాలకు పెమ్మసాని, గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు అభ్యర్థులు మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ అత్యంత ప్రభావంతమైన నాయకుల్లో జగజ్జీవన్ రామ్ ఒకరని, ఆయన నాయకత్వ పటిమను స్ఫూర్తిగా తీసుకొని నాయకులు ఎదగాలని తెలిపారు. రామాంజనేయులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. గళ్లా మాధవి మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం బాబు జగ్జీవన్‌రామ్ చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. మద్దిరాల మ్యానీ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ చేసిన పోరాటాన్ని ఈ వైసీపీ ప్రభుత్వం ఒకసారి గుర్తు పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పోతురాజు సమత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్



వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్

అమృతలూరు, ఏప్రిల్ 5: రాజకీయపార్టీల ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొనరాదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చినప్పటికి వాటి అమలులో వలంటీర్లు నిర్లక్ష్యం చూపుతున్నారు. అమృతలూరు 6వ వార్డులో వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి లక్ష్మీ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఆమె వెంట ఇదే వార్డుకు చెందిన వలంటీర్ నూతక్కి పద్మశ్రీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనిపై అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై వేటు

సత్తెనపల్లి, ఏప్రిల్ 5: ఎన్నికల కోడ్ ఉల్లంఘన నేపథ్యంలో సత్తెనపల్లి మండలం పాకాలపాడుకు చెందిన వలంటీర్లు బి.స్వాతి, ఈపూరి కృష్ణారెడ్డిలను విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో జగదీష్ తెలిపారు. కట్టావారిపాలెంలో ఉపాధి హామి పథకం ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతిరావును సస్పెండ్ చేసినట్టు ఏపీవో వెంకటనారాయణ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తూ వైసీపీ ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొనటంతో చర్యలు తీసుకున్నట్టు వారు తెలిపారు.

ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీ నేతకు చెంపదెబ్బ

కర్లపాలెం, ఏప్రిల్ 5: ప్రచారంలో ఉండగా వైసీపీ నేతను ఓ మహిళ చెంపదెబ్బ కొట్టిన ఘటన గురువారం రాత్రి యాదవపాలెంలో జరిగింది. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలోని చింతాయపాలెం పంచాయతీ యాదవపాలెంలో గురువారం రాత్రి ఎమ్మెల్యే కోన రఘుపతి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. పక్కనే ఉన్న మండల ఉపాధ్యక్షుడు పందరబోయన సుబ్బారావును ఎలికా నాగలక్ష్మి చెంపదెబ్బ కొట్టింది. దీంతో ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే కోన రఘుపతి, వైసీపీ నేతలు అవాక్కయ్యారు. సుబ్బారావు స్థలం విషయంలో తమకు అన్యాయం చేశాడని, తనపై అక్రమసంబంధం ఆరోపణలు చేశాడని ఆమె ఆరోపించింది. ఆ మహిళపై సుబ్బారావు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదుచేశామని ఎస్ఐ జనార్థన్‌తెలిపారు.

మైనారిటీల అభ్యున్నతికి టీడీపీ కృషి

- డాక్టర్ చదలవాడ అరవిందబాబు



ఇఫ్తార్‌లో పాల్గొన్న లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 5: రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల అభివృద్ధి, సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ప్రత్యేక కృషి చేస్తుందని ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. పట్టణంలోని రావిపాడు రోడ్డులో ఎన్నికల కార్యాలయం ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నరసరావుపేట పట్టణంతో పాటు జిల్లా నలుమూలల నుంచి ముస్లింలు పెద్దఎత్తున కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేల్పుల సింహాద్రి యాదవ్, జనసేన ఇన్‌చార్జి సయ్యద్ జిలాని, రావెల జ్ఞాని, గొట్టిపాటి చౌదరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి సేవ చేస్తే.. భూమిని కాజేశారు

- తోటి వైసీపీ నేతలే బినామీ పేర్లతో ఆక్రమించారు
- ఎమ్మెల్యే మహేష్‌రెడ్డిని ఆశ్రయించినా న్యాయం జరగలేదు
- నడికూడి మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ పెద పిచ్చయ్య



పెద పిచ్చయ్య


గురజాలటౌన్, ఏప్రిల్ 5: వైసీపీ కోసం కష్టపడి పనిచేస్తే ఆ పార్టీవారే తన భూమిని కాజేశారని నడికుడి మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ తగుళ్ల పెద పిచ్చయ్య ఆరోపించారు. శుక్రవారం మండలంలోని తేలుకుట్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలో తనకున్న 4.40 ఎకరాల్లో 30 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నామన్నారు. పట్టాలు కోసం గురజాల తహసీల్దార్ వద్దకు వెళ్తే పొలం నీ పేరు మీద లేదని చెప్పారన్నారు. తన పొలం తోటి వైసీపీ నేతలే బినామీ పేర్లపై ఆన్‌లైన్‌లో మార్చుకున్నారని తెలుసుకొని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వద్దకు వెళ్లి తమ పొలం పట్టాలు ఇప్పించాలని కోరామన్నారు. అయితే తనకు న్యాయం జరుగలేదని, అందుకే తన పదవికి, పార్టీకి రాజీనామా చేశానన్నారు. ఇది సహించలేని కొందరు వ్యక్తులు తనను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూమిని దక్కించుకోవడానికి చివరికి ఆర్డీవో కార్యాలయంలో రూ. 20 వేలు, తహసీల్దార్ కార్యాలయంలో రూ. 20 వేలను అక్కడి అధికారులకు ఇచ్చానన్నారు. అయినా ఫలితం రాలేదన్నారు. ఇక ఉన్నతాధికారులను ఆశ్రయించడమే నయం అని ఫిర్యాదు చేయనున్నట్లు పెదపిచ్చయ్య చెప్పారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

- కనుమరుగవుతున్న పంట కాల్వల గట్లు
- ఎన్నికల విధుల్లో అధికారులు
- చెలరేగిపోతున్న అక్రమార్కులు



చింతలపూడి పంటపొలాల్లో పంట కాల్వ మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్



ట్రాక్టర్‌లో మట్టిని తరలిస్తున్న దృశ్యం

పొన్నూరుటౌన్, ఏప్రిల్5: పొన్నూరు మండలంలో అక్రమ మట్టి తవ్వకందారులు అధికారపార్టీ అండతో చెలరేగిపోతున్నారు. మండల అధికారులు, ఎన్నికల విధుల్లో ఉండటంతో అక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మండలంలోని చింతలపూడి గ్రామంలో కొతివానిపాలెం గ్రామ రహదారిలో పంట కాల్వల గట్లను అనుమతులు లేకుండా తవి తరలించుకుపోయి విక్రయించుకుంటున్నారు. అలాగే వడ్డిముక్కల గ్రామంలో నాలుగైదు రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా మట్టి రవాణా సాగుతోంది. పంట పొలాల్లో మెరకవేసిన మట్టి తొలగిస్తున్నామని చెప్పి పంట కాల్వ గట్లను తవ్వకొని సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు కూడా ఎన్నికల విధులతోపాటు గ్రామాలో మట్టితవ్వకందారులపై నిఘా వేయాలన్ని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మాజీ జడ్పీటీసీ ఉప్పుటూరి సీతామహాలక్ష్మి కన్నుమూత



భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న రామాంజనేయులు, ఇన్‌సెట్లో సీతామహాలక్ష్మి

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 5: వట్టిచెరుకూరు మండల మాజీ జడ్పీటీసీ ఉప్పుటూరి సీతామహాలక్ష్మి(64) అనారోగ్యంతో గత కొంతకాలంగా చికిత్స పొందుతూ శుక్రవారం గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆమె మరణంతో మండలంలోని ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమె భౌతికకాయాన్ని పుల్లడిగుంటలోని స్వగృహానికి తీసుకొచ్చారు. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. సీతామహాలక్ష్మి 2014లో టీడీపీ తరపు న వట్టిచెరుకూరు మండల జడ్పీటీసీగా గెలుపొందారు. గ్రామంలో ప్రతిఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ తన వద్దకు ఎలాంటి సహాయం కోసం వచ్చినా లేదనకుండా, తన వంతు సహకారాన్ని అందిస్తూ చెరగని ముద్ర వేసుకున్నారు. అందుకే ఆమెను అంతా అమ్మ అని ఆప్యాయంగా పిలుస్తారు. తన కుమారుడు ఎన్ఆర్ఐ ఉప్పుటూరి రామ్‌చౌదరి ప్రోత్సాహం, తోటి ఎన్ఆర్ఐల సహకారంతో ప్రభుత్వ ప్రైవేటు స్కూల్స్ ప్రభుత్వ కార్యాలయాల్లో ఉప్పుటూరి చినరాములు సేవాట్రస్ట్ పేరుతో వాటర్‌కూలర్లు అందించారు. ఏటా రైతులకు విత్తనాలు, యంత్ర పరికరాలు అందజేస్తున్నారు. పది పరీక్షల సమయంలో మండలంలోని స్కూళ్ళలో పరీక్ష సామాగ్రితో పాటు మజ్జిగప్యాకెట్లు అందించారు. వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాల్లోని పలు స్కూళ్ళలో చిన్నారులకు బ్యాగ్‌లు, నోట్‌పుస్తకాలు అందించి తమ ఉదారతను చాటుకు న్నారు. సీతామహలక్ష్మి మరణవార్త తెలిసిన వెంటనే ప్రత్తిపాడు నియో జకవర్గ టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, జనసేన ప్రత్తిపాడు నియోజ కవర్గ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వ రరావు, పలువురు నాయకులు శుక్రవారం పుల్లడిగుంటలోని ఆమె స్వగృహానికి చేరుకొని ఆమె భౌతికకాయా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె భర్త చినరాము లు, కుమారుడు, ఎన్ఆర్ఐ రామ్‌చౌదరి, ఇతర కుటుంబ సభ్యుల ను పరామర్శించారు. సీతామహాలక్ష్మి భౌతికకాయానికి శనివారం ఉదయం 11 గంటల ప్రాం తంలో స్థానిక శ్మశానవాటి కలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు వెల్లడించారు.

18 నెలల పసిపాప మృతి

- భర్తపై ఫిర్యాదు చేసిన భార్య



పాప తల్లి శ్రావణి

కారంపూడి, ఏప్రిల్ 5: మండలంలోని పేటసన్నిగండ్లలో గత నెల 31వ తేదీ రాత్రి 18 నెలల పసిపాప మృతిచెందింది. అయితే భర్తపై అనుమానం వ్యక్తం చేస్తూ భార్య పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో శుక్రవారం వైద్యులు ఆ చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పేటసన్నిగండ్లకు చెందిన మన్నెం మహేష్‌కు ఈపూరు మండలం బొమ్మరాజుపల్లెకు చెందిన శ్రావణితో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 18 నెలల పాప అక్షయ సంతానం. కాగా గత నెల 31వ తేదీన అక్షయ ముక్కు నుంచి రక్తం కారుతూ విగతజీవిగా మారింది. గమనించిన తల్లిదండ్రులు ఆ పాపను కారంపూడిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మరుసటి రోజు ఈనెల 1వ తేదీన పాపను ఖననం చేశారు. అయితే తన కుమార్తె మరణం పట్ల తన భర్తపై అనుమానం ఉందని శ్రావణి కారంపూడి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శుక్రవారం గుంటూరు మెడికల్ కళాశాల ప్రొఫెసర్లు గ్రామానికి చేరుకొని ఖననం చేసిన అక్షయ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. మృతికి గల కారణాలు కొద్ది రోజుల్లో తెలుస్తాయని సీఐ చిన మల్లయ్య తెలిపారు.


8న సాగర్ కుడి కాలువకు నీటి విడుదల

విజయపురిసౌత్, ఏప్రిల్ 5: వేసవి దృష్ట్యా ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం ఈనెల 8వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం నాగార్జున సాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేయనుంది. ఈ మేరకు ప్రభుత్వం ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ కుడి కాలువ ద్వారా 5500 క్యూసెక్కుల చొప్పున ఈ నెల 18వ తేదీ వరకు నీటిని విడుదల చేయాలని ఉత్తర్వులిచ్చారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలోని అధికారులు తమ పరిధిలోని 461 సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను నీటితో నింపుకోవాలని ఉత్తర్వుల్లో తెలిపారు.

హైవేపై అదుపుతప్పిన మినీ బస్సు

- ఒకరి మృతి, నలుగురికి గాయాలు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 5: స్పైసెస్ పార్కుకు ఉద్యోగులతో వెళుతున్న మినీ బస్సు అదుపు తప్పిన ఘటన మండలంలోని తుమ్మలపాలెం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ప్రత్తిపాడు పోలీసుల కథనం ప్రకారం గుంటూరు నుంచి యడ్లపాడు వద్ద స్పైసెస్ పార్కుకు మినీ బస్సు 12మంది ఉద్యోగులతో వెళుతోంది. అయితే డ్రైవర్ వేగంగా బస్సు నడపటంతో తుమ్మలపాలెం వద్ద బస్సు అదుపుతప్పింది. దీంతో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఐరన్ ఫెన్సింగ్‌ను బస్సు గుద్దుకుంటూ సర్వీసు రోడ్డు పక్కనే ఉన్న రెయిన్ వాటర్ డ్రైనేజీలో పడింది. ఒక్కసారిగా బస్సు అదుపుతప్పడంతో బస్సు వెనుక కూర్చున్న గుంటూరు రూరల్ మండలం నల్లపాడు గ్రామానికి చెందిన కరణం శేషసాయి కుమార్(28) అక్కడికక్కడే మరణించాడు. మరో నలుగురికి గాయాలు అయ్యాయి. వీరిని వెంటనే గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ సోమేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అదుపు తప్పి కాలువలో కూరుకుపోయిన మినీ బస్సు

రాష్ట్ర పోలీసు చెక్‌పోస్టు తనిఖీ

దాచేపల్లి, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పల్నాడు జిల్లాలోకి ఎటువంటి అక్రమ మద్యం, పరిమితికి మించిన నగదు సరఫరా కాకుండా నిరంతరం అప్రమత్తంగా వుండాలని నూతనంగా పల్నాడు జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బిందుమాధవ్ అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. శుక్రవారం పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగల అంతరాష్ట్ర పోలీసు చెక్‌పోస్టును ఎస్పీ బిందు మాధవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల తనిఖీ సమయంలో ఏమైనా వాహనాలు, వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే మీ పై అధికారులకు తెలియజేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ బాల నాగిరెడ్డి, ఎస్ఐ శివ నాగరాజు, తదితరులున్నారు.



పొందుగల రాష్ట్ర పోలీసు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పల్నాడు జిల్లా ఎస్పీ బిందు మాధవ్

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.03
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161, 172
చికెన్ విత్ స్కిన్	292.00
చికెన్ స్కిన్ లెస్	302.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



ప్రజలకు అభివాదం చేస్తున్న వేగేశన నరేంద్రవర్మ

ఆలోచించండి ఆశీస్సులు అందించండి

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన

బాపట్ల, ఏప్రిల్ 5 : ప్రతి ఒక్కరు ఆలోచించి ఆశీస్సులు అందించాలని, తెలుగుదేశంపార్టీని గెలిపించాలని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ కోరారు. పట్టణంలోని 26, 30, 31వ వార్డులలో శుక్రవారం సాయంత్రం నరేంద్రవర్మ పెద్దఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రధాన వీధులలో రోడ్డుషో నిర్వహిస్తూ ప్రజల వద్దకు నడుచుకుంటూ వెళ్ళి తెలుగుదేశంకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. పట్టణంలో ప్రధాన రహదార్లు మినహాయించి నియోజకవర్గంలో ఏ ఒక్క రోడ్డు కూడా వైసీపీ నాయకులు అభివృద్ధి చేయలేదన్నారు. డ్రైనేజి వ్యవస్థ సరిగ్గాలేక దోమల వ్యాప్తితో ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. అవినీతి లేని పాలన ప్రజలకు అందించాలని తాను రాజకీయాలలోకి వచ్చానని నరేంద్రవర్మ స్పష్టం చేశారు. జిల్లా తెచ్చామని గొప్పలు చెప్పుకునే పాలకులు సౌకర్యాలు కల్పనలో విఫలమయ్యారని విమర్శించారు. అభివృద్ధి పేరిట అక్రమాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ప్రశ్నించేవారిపై కేసులు, బెదరింపులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. జగనన్నకాలనీలలో కనీస వసతులు కల్పించలేకపోయారన్నారు. బాపట్ల ప్రజలకు అవసరమైన సమ్మర్ స్టోరేజి ట్యాంక్ మరొకటి ఏర్పాటు చేసేందుకు తాను కృషి చేస్తానన్నారు. శానిటరి సిబ్బందిని పెంచి పారిశుధ్యపనులు సజావుగా నిర్వహించేవిధంగా చూస్తామన్నారు. మున్సిపల్ ఉద్యోగులను అధికారులు తమ ఇళ్ళల్లో పనులు చేయించుకుంటున్నారని నరేంద్రవర్మ ఆరోపించారు. ఎమ్మెల్యే ఇంట్లో ఆవులకు మేత ఖర్చు కూడా వ్యాపారులు పెట్టుకునే పరిస్థితి ఇక్కడ నెలకొని ఉందన్నారు. రాజకీయ వ్యాపారాలు తనకు రావని కేవలం సేవ చేయటమే తనకు వచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, అల్లం గోపీకృష్ణ, జిట్టా శ్రీనివాసరావు, నాగరాజు, నల్లమల్లి నాగేశ్వరరావు, దండమూడి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న వేగేశన నరేంద్రవర్మ

వేగేశన నరేంద్రవర్మకు మద్దతు ప్రకటించిన బీజేపీ నాయకులు

కర్లపాలెం, ఏప్రిల్ 5 : భారతీయ జనతా పార్టీ జిల్లా నాయకుడు ఆట్ల వెంకటకృష్ణారెడ్డి బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మను కలిసి గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని తమ మద్దతును తెలిపారు. నరేంద్రవర్మను వెంకటకృష్ణారెడ్డి దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రామిరెడ్డి, శివకృష్ణ తదితరులు ఉన్నారు.

రంజాన్ తోఫా అందజేత

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 5 : మండలంలోని చందోలు గ్రామపంచాయతీకి చెందిన తెలుగుదేశం పార్టీ యువనాయకులు సయ్యద్ నిజాం సౌజన్యంతో ఆలీ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో పేదముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా శుక్రవారం వేగేశన నరేంద్రవర్మ చేతులమీదగా రంజాన్ తోఫా అందజేశారు. దీక్షాపరులైన ముస్లింలకు ఇఫ్తార్ విందును వడ్డించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎండి అఫ్జల్, బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు మహ్మద్ ఖాసీం, బాపట్ల పార్లమెంట్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ జునేద్, చందోలుగ్రామ టీడీపీ అధ్యక్షులు మహ్మద్ రజాక్, టీడీపీసీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు కనుమూరి సాంబమూర్తిరాజు, మోదుగుల శంకరరెడ్డి, జాలాది లోకరాజ్యులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పిట్టు సాయిబాబారెడ్డి, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు గోకరాజు శ్రీధర్‌వర్మ, నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కలకోట కిషోర్‌రెడ్డి, మండల మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రాం సేవలు చిరస్మరణీయం

● టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, ఏప్రిల్ 5 : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త బాబుజగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. బాపట్ల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శుక్రవారం జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన పటానికి పార్టీశ్రేణులతో కలిసి కృష్ణప్రసాద్ పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతపార్లమెంట్‌లో 40ఏళ్ళపాటు వివిధ మంత్రి పదవులు నిర్వహించటమే కాకుండా ఉపప్రధానిగా అనేక సంస్కరణలకు రూపకల్పన చేశారన్నారు. భారతదేశంలో హరితవిప్లవం, వ్యవసాయాన్ని ఆధునీకరించటంలో ఆయన అందించిన సహకారం ఎనలేనిదన్నారు. కేంద్ర వ్యవసాయ మంత్రిగా 1974 కరవు సమయంలో, ఆహారసంక్షోభాన్ని నివారించటానికి ప్రత్యేకంగా అదనపు మంత్రిత్వశాఖను నిర్వహించమని కోరినప్పుడు ఆయన అంగీకారం తెలపటం ఎప్పటికి గుర్తుంచుకోవాల్సిన విషయమన్నారు. ఆయన ఆశయాలు అనుసరిస్తూ ప్రతిఒక్కరు ఆయన అడుగుజాడలలో పయనించాలని కృష్ణప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, సీనియర్ న్యాయవాది కళ్ళం హరినాధరెడ్డి, టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు, మందపాటి ఆంధ్రేయ, ఎండి మొహిద్దీన్‌బేగ్, పల్లం సరోజనీ, దగ్గుమల్లి రాణి, పరిశా రమేష్‌గౌడ్, దగ్గుమళ్ళ సుభాషణరావు, షాకా, పల్లంజీవన్ తదితరులు పాల్గొన్నారు.



బాబుజగ్జీవన్‌రామ్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్, పార్టీశ్రేణులు.

కొరియర్ సర్వీస్ సెంటర్‌లో పోలీసుల తనిఖీలు

బాపట్ల,ఏప్రిల్ 5 : ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు పార్శిల్ కార్యాలయాలు, కొరియర్ సర్వీస్ సెంటర్‌లు, ఆన్‌లైన్ డెలివరి పాయింట్‌లను పట్టణ పోలీసులు శుక్రవారం తనిఖీ చేశారు. పట్టణ సీఐ యు.శ్రీనివాసులు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించటానికి కావాల్సిన అన్నిరకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

● కొల్లూరు, ఏప్రిల్ 5 : లంక గ్రామాల్లో భద్రతా బలగాలు కవాతు నిర్వహించాయి. శుక్రవారం మండల పరిధిలోని ఈపూరులంకలో స్థానిక ఎస్ఐ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర భద్రత బలగాలు పురవీధుల్లో కవాతు నిర్వహించాయి. కొల్లూరు లాకు సెంటరులో వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు.

తీరగ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే కోన

కర్లపాలెం,ఏప్రిల్ 5 : రాబోయే రోజులలో సముద్రతీరప్రాంత గ్రామాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేలా చర్యలు చేపడతామని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. కర్లపాలెం మండలంలోని పెదగొల్లపాలెం, గణపవరం, పెదపులుగువారిపాలెం, నర్రావారిపాలెం గ్రామాలలో శుక్రవారం కోన రఘుపతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి, ఎంపీపీ యారం వనజ, సర్పంచ్ అక్కల శ్రీనివాసరెడ్డి, అంకమ్మ, సురేష్‌రాధవ్ (నాని) దబ్బకూటి ఏడుకొండలు, నక్కా లలితకుమారి, ఎంపిటిసిలు రాతంశెట్టి లక్ష్మణ్, సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు పందరబోయన సుబ్బారావు, కాగిత కరుణకుమారి, బెనర్జి పాల్గొన్నారు.

లంక గ్రామాల్లో ఆనందబాబుకు జననీరాజనం

● దారిపొడవునా హారతులిచ్చిన మహిళలు



చింతమోటు గ్రామం వద్ద గజమాలతో ఆనందబాబుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

భట్టిప్రోలు, ఏప్రిల్ 5 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు శుక్రవారం రాత్రి మండలంలోని నదీపరివాహక ప్రాంతం లంక గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మండలంలోని చింతమోటు కొత్త కాలనీ ప్రారంభంలో ప్రజలు గజమాలలతో ఆనందబాబుకు ఘన స్వాగతం పలికారు. మహిళలు దారి పొడవునా హారతులు ఇచ్చారు. ప్రచార రథం దారి పొడవునా భారీగా ప్రజలు ద్విచక్రవాహనాలతో భారీ ర్యాలీగా పాల్గొన్నారు. మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక గ్రామాల్లో ప్రచార రథంపై నుంచి కిందకు దిగి అడుగడుగునా ప్రజలను కలుస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసమే ఉమ్మడిగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించారన్నారు. కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి, నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందని, భారీ మెజార్టీతో తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని ప్రజలకు ఆనందబాబు హామీ నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, మండల కన్వీనర్ వాకా శేషుబాబు, నాయకులు వేములపల్లి జగన్నాధరావు, వేములపల్లి శివకుమార్, శొంఠి సుబ్బారావు, జార్జి, ఆదాం, వెంకయ్య, నాగయ్య చౌదరి, బేతపూడి నాగమనోహర్, మోటూరు పుణ్యశ్రీనివాసరావు, వేములపల్లి కమలాకర్, తల్లపనేని నాని, పరుచూరి రమేష్, బట్టు మల్లికార్జునరావు, ఎన్ఆర్ఐ టీడీపీ నాయకులు పమిడిముక్కల మణికంఠ, టీడీపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మండలంలోని లంక గ్రామాల్లో గుమ్మడికాయతో హారతులిస్తున్న మహిళలు

ఎస్సీల సంక్షేమానికి బాబు జగ్జీవన్‌రామ్ విశేష కృషి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఏప్రిల్ 5 : బలహీనవర్గాల ప్రజల సంక్షేమం కోసం, కార్మికుల అభ్యున్నతికి బాబుజగ్జీవన్‌రామ్ విశేష కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. బాబుజగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాన్ని ఎస్సీ సంక్షేమ సాధికారితశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ చేస్తూనే కులనిర్మూలన ఉద్యమాలు నడిపిన గొప్పనాయకుడిగా బాబుజగ్జీవన్‌రామ్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి జె.రాజాదెబోరా, సీపీవో శ్రీనివాసరావు, డీపీవో రవికుమార్, పౌరసరఫరాల సంస్థ డీఎం చంద్రశేఖర్, పీఆర్ఎస్ఈ శ్రీనివాసరావు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్‌రామ్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఆడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్

● జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం బాబుజగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ అధికారులతో కలిసి ఆయన పటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ నేటి తరానికి జగ్జీవన్‌రాం ఆదర్శనీయులు అన్నారు. ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, వెల్ఫేర్ ఆర్ఐ డి.శ్రీనివాసరెడ్డి, అడ్మిన్ ఆర్ఐ షేక్. మౌలుద్దీన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ పఠాన్ రాజేష్ సభ్యులతో కలిసి ఆయన పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో తాజుద్దీన్, శీలం సాగర్, బక్కా రోశయ్య, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల వ్యవసాయ కళాశాలలో శుక్రవారం బాబుజగ్జీవన్‌రాం జయంతిని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సి.సంధ్యారాణి, డాక్టర్ ఎం.లత, డాక్టర్ బి.అపర్ణ, డాక్టర్ డివి.సాయిరాంకుమార్, డాక్టర్ ఎ.గోపాల్, డాక్టర్ టి.మధుమతి, డాక్టర్ కె.సుశీల, డాక్టర్ ఎస్.ప్రతిభశ్రీ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

● బాపట్ల స్నేహక్లబ్ ఆధ్వర్యంలో బాబుజగ్జీవన్‌రామ్ జయంతి మండలపరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దంపతుల విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో డాక్టర్ కటికల శివభాగ్యారావు, డాక్టర్ పీసీ.సాయిబాబు, డాక్టర్ కాగిత వరప్రసాదరావు, గురజాల శ్రీనివాసరావు, దాసరి లక్ష్మీ పాల్గొన్నారు.

● బాబుజగ్జీవన్‌రాం జయంతిని బాపట్ల బీసీ బడుగు బలహీనవర్గాల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఉప్పాల మురళీగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన పటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో గవిని సుధాకర్, గంటా శంకరరావు, దానీయేలు, చెంచుబాబు, టి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● రేపల్లె, ఏప్రిల్ 5 : దళిత జాతి అభ్యున్నతికి కృషి చేసిన మహో



పార్టీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

న్నతమైన వ్యక్తి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశ తొలి ఉపప్రధానిగా, కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టి ప్రజలకు చేసిన సేవలు మరువరానివన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో నిస్వార్థంగా పాల్గొన్న వ్యక్తి అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, ఆలూరి డానియేలు, పీవీ చింతారావు, మేకా రాజేష్‌కన్నా, కొపనాతి రాజశేఖర్, కేసన రామకృష్ణ, తాతా ఏడుకొండలు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, గొర్రె సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

● మహనీయుల రాజకీయ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని దళితులు రాజ్యాధికార సాధనకు నడుంబిగించాలని జైభీమ్‌భారత్ పార్టీ జైభీమ్ రామ్ భారత్ పార్టీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ దోవా రమేష్‌రాంజీ అన్నారు. దేశ మాజీ ఉపప్రధాని బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కర్రా బాబూరావు, మెరుసు వెంకట్రావు, నాయుడు పోతార్లంక శివ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం రేపల్లె పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్, కే.ఆశీర్వాదం, కె.లక్ష్మణ్‌రావు, కె.చిట్టిబాబు, వెంకట్రావు పాల్గొన్నారు.

● అమృతలూరు, ఏప్రిల్ 5 : భారత మాజీ ఉపప్రధాని, స్వాతంత్ర సమరయోధుడు, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి జగ్జజీవన్‌రామ్ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ మండల కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జగ్జజీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యలవర్తి బ్రహ్మానందం, క్రొత్తపల్లి రవీంద్రబాబు, ఐమళ్ళ ప్రమోద్, పాములపాటి వెంకటసుబ్బారావు, మ్యాథూస్, బాబు, అమర్తలూరి ప్రభాకరరావు, సుదీర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● వేమూరు, ఏప్రిల్ 5 : వేమూరు మండల గ్రామాల్లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో వివిధ పార్టీల నాయకులు, దళితులు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమూరులో జగ్జీవన్‌రావ్ విగ్రహానికి వైసీపీ, టీడీపీ నాయకులు, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● కర్లపాలెం, ఏప్రిల్ 5 : మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం రాజీవ్‌నగర్‌లో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, నక్కల వెంకటస్వామి, వసంతరెడ్డి, దాసు ఉన్నారు.

చంద్రబాబు పాలనలో మహిళలకు పెద్దపీట

వేమూరు, ఏప్రిల్ 5 : డ్వాక్రా గ్రూపుల ద్వారా మహిళా సాధికారతకు పెద్దపీట వేసింది చంద్రబాబునాయుడు అని తెలుగుదేశం పార్టీ నాయకుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం వేమూరులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాలనలో రాష్ట్రం రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. ఇంటింటికి తిరుగుతూ ఎమ్మెల్యే అభ్యర్థిగా నక్కా ఆనందబాబు, ఎంపీ అభ్యర్థిగా విద్యావంతుడైన తేనేటి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జనసేన పార్టీ సమన్వయ కర్త ఉసా రాజేష్, విష్ణుమొలకల శ్రీనివాసరావు, అమ్మిశెట్టి కిషోర్, గొట్టిపాటి నరహరిప్రసాద్, ఎలిచెర్ల ఇస్సాకు, కోగంటి శ్రీనివాసరావు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

దోనేపూడిలో టీడీపీ శ్రేణుల ప్రచారం

కొల్లూరు, ఏప్రిల్ 5 : వేమూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు తరుపున టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు ప్రచారం నిర్వహించారు. మండల పరిధిలోని దోనేపూడిలో శుక్రవారం పార్టీ శ్రేణులు ఇంటింటికి తిరుగుతూ ఉమ్మడి అభ్యర్థి ఆనందబాబుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ, బాబు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు. ప్రచార కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, జిఎల్‌జి భగవాన్, వెనిగళ్ల మహేష్, నిమ్మగడ్డ అనీల్, యలవర్తి కోటేశ్వరరావు, ఎన్నారై మణికంఠ, వేములపల్లి మోహనకృష్ణ, కోగంటి శివవెంకటేశ్వరరావు, దూళిపూడి కృష్ణ, మున్నంగి విజయ్, శిగిలిశెట్టి రాఘవరావు, తోట సాంబయ్య, యడ్ల శ్రీను, బుర్రి జగన్, కొమ్ము తులామాను, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు చేస్తున్న వైసీపీ

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 5 : రాజకీయంగా తెలుగుదేశం పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకోవటం కొత్తగా పెట్టుకున్న పొత్తుకాదని వైసీపీ నాయకులు ఓటర్లను తప్పుదోవ పట్టించడానికి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని పిట్టలవానిపాలెం మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి అన్నారు. మండలంలోని సంగుపాలెంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రజలకు తప్పుడు సంకేతకాలు ఇస్తుందని వివరించారు. మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి హయాంలో బీజేపీతో పొత్తుపెట్టుకొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఆనందబాబు తనయుడు అఖిలేశ్

జగన్ అసమర్థ పాలనతో రైతు, యువతకు కష్టాలు

చుండూరు ఏప్రిల్ 5 : జగన్ ఐదు సంవత్సరాల అసమర్థ పాలనలో రైతులు, యువత తీవ్ర కష్టానష్టాలను ఎదుర్కొన్నారని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తనయుడు అఖిలేశ్ అన్నారు. శుక్రవారం మోదుకూరులో సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత ఐదు సంవత్సరాలుగా పంట కాల్వలు, మురుగు కాల్వలు, రోడ్లు, మరమ్మతులకు నోచుకోలేదన్నారు. తిరిగి రాష్ట్రం ఉజ్వలంగా మారాలంటే చంద్రబాబుకే అది సాధ్యమన్నారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గుదేటి యల్లారెడ్డి, టీఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శరత్‌చంద్ర, ఆళ్ల వెంకటసుబ్బారెడ్డి, కొల్లి శ్రీనివాసరెడ్డి, మండల జనసేన నాయకులు పోకల శ్రీనివాసరావు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు హఠాన్మరణం

బాపట్ల,ఏప్రిల్ 5 : మండలంలోని కొండుభొట్లపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న పోలిశెట్టి సుబ్బారావు హఠాన్మరణం చెందారు. గతంలో ఆయన కర్లపాలెం మండలం ఇన్‌చార్జి ఎంఈవోగా పని చేశారు. పట్టణంలోని వివేకానందకాలనీలో ఉన్న ఆయన భౌతికకాయాన్ని పలువురు ఉపాధ్యాయులు, అధికారులు సందర్శించి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. శుక్రవారం అంత్యక్రియులు నిర్వహించారు.

అంకమ్మతల్లి దేవాలయంలో అష్టలక్ష్మీస్తోత్రం

బాపట్ల, ఏప్రిల్ 5 : పట్టణంలోని శీలంవారిపాలెంలో ఉన్న శ్రీ అంకమ్మతల్లి దేవాలయంలో విశ్వహిందుపరిషత్ మహిళా సత్సంగ్ ప్రముఖ్ బండ్రెడ్డి రజనీ ఆధ్వర్యంలో మణిద్వీప వర్ణన, అష్టలక్ష్మీస్తోత్రం, దుర్గాదేవి పాటలు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందుపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.



అవ్వా నీఓటు నాకేనంటూ కరపత్రాన్ని అందిస్తున్న అనగాని సత్యప్రసాద్

ఆశీర్వదించండి.. అండగా ఉంటా

● రేపల్లెను మరింత అభివృద్ధి చేస్తా

● అడుగడుగునా అనగానికి జనం నీరాజనాలు, హారతులు

రేపల్లె, ఏప్రిల్ 5: రానున్న సార్వత్రిక ఎన్నికలు మీరంతా అండగా ఉండి తనను ఆశీర్వదించాలని మీకు అండగా నేను ఉంటానంటూ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ కోరారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా శుక్రవారం పట్టణంలోని బూరుగలమ్మ దేవాలయం, పేటేరు రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ, నాయకులతో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ మండలంలోని పేటేరు గ్రామం నుంచే ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనగానికి వేలాదిగా ప్రజలు సంఘీభావం తెలిపి అడుగుడున మహిళలు పెద్ద ఎత్తున హారతులు పట్టారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. చేనేత కార్మికులకు అండగా ఉంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రత్యేక గుర్తింపు తీసుకుని వస్తానని హామీనిచ్చారు. చేనేత వస్త్రాలను నేరుగా అమ్ముకునే విధంగా తన వంతు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కృషి చేస్తానన్నారు. 2019లో బాపట్ల ఎంపీగా గెలిచిన నందిగం సురేష్ ఈ ఐదేళ్ళలో ఎక్కడైన కనిపించాడా అని ప్రశ్నించారు. ఎంపి అమరావతి రాజధాని ప్రాంతంలో పైప్‌లు, రోడ్లకు వేసిన గ్రావెల్స్, ఇసుక మాఫియా తప్పితే బాపట్ల ప్రాంతంలో ఒక్క అభివృద్ధి అయిన చేశాడా అని ప్రశ్నించారు. అత్యంత క్రూరంగా అమర్‌నాథ్ మృతి చెందితే ఇంటి ముందు ధర్నా చేస్తుంటే కనీసం వచ్చి పలకరించిన దాఖలాలు ఈ వైసీపీ అభ్యర్థి గణేష్ చేశాడా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, మేకా శివరామకృష్ణ, తాతా ఏడుకొండలు, గోలి రామశేషు, డీవీఎస్ఆర్‌శాస్త్రిగోలి వెంకటేశ్వరరావు, వాకా శంకరరావు, చందోలు వెంకయ్య, వంగర శ్రీను, శొంఠి సుజాత, కోదండరామ్, కనికచర్ల కిషోర్, రేపల్లె రామాంజనేయులు, విచారపు వీరయ్య, .జీవీ నాగేశ్వరరావు, చింతల సుబ్బారావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు, రేపల్లె జానకీరామయ్య బీజేపీ నాయకులు అన్నం సాయి వరప్రసాద్, పిన్ని సాంబశివరావు, గుమ్మడి సాంబశివరావు పాల్గొన్నారు.



ప్రచార రథం నుంచి ప్రజలకు విక్టరీ చూపెడుతున్న ఎమ్మెల్యే అనగాని



పేటేరు ప్రచార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి రావాలి : అనగాని

రేపల్లె, ఏప్రిల్ 5 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. బీజేపీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి బీజేపీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు తమకు అండగా నిలవాలని కోరారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి గెలిపే ధ్యేయంగా కృషి చేయాలన్నారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చేసుకోవటానికి దోహదపడుతుందన్నారు. ఈ సమావేశంలో పట్టణాధ్యక్షుడు అన్నం సాయివరప్రసాద్, ఇంకొల్లు మాణిక్యారావు, విశ్వనాథపల్లి వెంకటేశ్వరరావు, పిన్ని సాంబశివరావు, బేతపూడి వెంకటేశ్వరావు, టీడీపీ నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తాం : గూడపాటి

రేపల్లె, ఏప్రిల్ 5 : రాష్ట్రంలో రానున్నది ఎన్డీయే కూటమి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. 12వవార్డులోని హౌసింగ్‌బోర్డు కాలనీలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులైన లేబాక మాధవరావు, గుమ్మడి వీరరాఘవయ్య, శంకర్, జనకృష్ణ, మరో పది కుటుంబాలకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానాన్ని కల్పిస్తామని, 40 రోజులు కష్టపడండి ఐదేళ్ళు పట్టణాన్ని అభివృద్ధిపథంలో నడుపుతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తాడివాక శ్రీనివాసరావు, టీడీపీ పట్టణాధ్యక్షుడు గోగినేని పట్టాభిరామారావు, వార్డు అధ్యక్షుడు వెనిగళ్ళ శివసుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, ల్యాబ్ కిషోర్, డొక్కు వెంకటేశ్వరరావు, కసుకుర్తి సంగీత్, దేవగిరి రవి, సజ్జా ప్రసాద్, శ్రీకాంత్, జనసేన పార్టీ నాయకులు రాసంశెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొల్లూరులో విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొల్లూరు, ఏప్రిల్ 5 : కొల్లూరు సబ్ స్టేషన్‌లో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న క్రమంలో కొల్లూరు, రావికంపాడు, బొద్దులూరుపాడు, క్రాప, దోనేపూడి, కోటిపల్లి, చినపులివర్రు, గాజుల్లంక, పెసర్లంక, ఆవులవారిపాలెంలలో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పేర్కొన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ కరువు

- టీడీపీ అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే వృద్ధులకు పింఛన్ రూ.నాలుగు వేలు అందిస్తాం
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

బల్లికురవ, ఏప్రిల్ 5: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తెలుగు దేశం పార్టీ పుట్టిందని, వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లిన ఘనత చంద్రబాబుది అని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని కొణిదెన గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ వైసీపీ పాలనలో బీసీలు, ఎస్సీలు, మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. వారికి రక్షణ లేకుండా పోయిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పేదలు, పెత్తందారులు అంటూ గొప్పలు చెప్పటం తప్ప, పేదల గురించి పట్టించుకోవటం లేదన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీని చేసిన విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. వైసీపీ పేదలకు పది రూపాయలు పంచుతూ వంద రూపాయలు గుంజుతుందన్నారు. ఆ పార్టీకి ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. లేకుంటే రాబోయే రోజుల్లో ప్రజల రక్తాన్ని కూడా వారు అమ్ముకొంటారన్నారు.


ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన మల్లాయపాలెం కాలనీవాసులు

ఎంతో అనుభవశాలి, సంపద సృష్టించే సత్తా ఉన్న చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకొంటే రాజధాని నిర్మాణం పూర్తి చేయటంతో పాటు పోలవరంను కూడా పూర్తిచేసి రైతులకు ఏడాది మొత్త నీటిని అందిస్తామని రవికుమార్ పేర్కొన్నారు. అధికారం చేపట్టిన మొదటి నెలలోనే వృద్ధులకు నెలకి నాలుగు వేల వంతున పింఛన్ అందిస్తామన్నారు గతంలో రంజాన్ పండుగ వచ్చిందంటే ముస్లింలకు రంజాన్ తోఫా అందించి మసీదుల మరమ్మతులకు నిధులు ఇచ్చామన్నారు. గత అయిదేళ్ల నుంచి ముస్లింల గురించి వైసీపీ పట్టించుకోలేదని అయన విమర్శించారు. తిరిగి పార్టీ అధికారంలోకి రాగానే గతంలో అందించిన సంక్షేమ పథకాలను మరలా అన్నివర్గాల ప్రజలకు అందిస్తామని చెప్పారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో గతంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రజలందరూ కృషి చేయాలని ఇంటింటికి తిరిగి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల నేతలు కొండేటి ఇజ్రాయల్, మలినేని గోవిందరావు, గొట్టిపాటి శంకర్, చెరుకూరి అంజనేయులు, గుంజి సుబ్బారావు, ఆర్వపల్లి అంజనేయులు, తన్నీరు ఏడకొండలు, కోటేశ్వరరావు, యిన్నమూరి ఉమామహేశ్వరరావు, దద్దాల అంజయ్య పాల్గొన్నారు.


కొణిదెనలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్


చవిటిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న హర్షవర్ధన్

టీడీపీ చేరిన మల్లాయపాలెం కాలనీవాసులు

బల్లికురవ, ఏప్రిల్ 5: మండలంలోని మల్లాయపాలెం ఎస్సీ కాలనీకి చెందిన 15 కుటుంబాలు శుక్రవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే గృహానికి వెళ్లిన వారికి అయన టీడీపీ కండువాలు వేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరినవారిలో పల్లెపోగు గంగాధర్, వెంకటేశ్వర్లు, జంద్రాజుపల్లి నాగమల్లి, యర్రబాబు, కోటేశ్వరరావు, సూరిబాబు తదితరులు ఉన్నారు.

ఉపాధిలేక యువత వలస

సంతమాగులూరు, ఏప్రిల్ 5: గడిచిన నాలుగున్నరేళ్ళగా రాష్ట్రంలో నూతన పరిశ్రమలు రాక నిరుద్యోగులకు ఉపాధిలేక యువత ఇతర రాష్ట్రాలకు వలస పోతుందని టీడీపీ యువనాయకుడు గొట్టిపాటి హర్షవర్ధన్ అన్నారు. సంతమాగులూరు మండలం గురిజేపల్లిలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ గెలుపును ఆకాంక్షిస్తూ ఆయన తనయుడు హర్షవర్ధన్, జనసేన, బీజేపీ నాయకులు ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కలిగించారు. రాష్ట్ర భవిష్యత్తు, యువత బవిష్యత్తు కోసం కూటమిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గాడిపర్తి వెంకట్రావు, కార్యదర్శి దూపాటి ఏసోబు, తెల్లప్రోలు రమేష్, అట్లా పెద వెంకటరెడ్డి, నాగబోతు సుజాత, కోణికి గోవిందమ్మ, జనసేన మండల అధ్యక్షుడు జి. రామాంజి, చల్లా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన జగన్

- వ్యక్తి గత ప్రతిష్ఠ, ఆదాయంపైనే సీఎం ఆరాటం
- మాజీ సొసైటీ అధ్యక్షుడు ఆంజనేయులతో పాటు 30 కుటుంబాలు టీడీపీలో చేరిక
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, ఏప్రిల్ 5: ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన జగన్ ప్రభుత్వంలో విలువలు, గౌరవం దక్కని, మనోభావాలు దెబ్బతిన్న నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శుక్రవారం మార్టూరు గ్రామంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు, సీనియర్ రాజకీయ నాయకుడు వైసీపీకి చెందిన తగెడ్ల అంజనేయులుతో పాటు 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వారందరూ మార్టూరు నుంచి ద్విచక్రవాహనాలతో ర్యాలీగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రాగా, ఏలూరి పార్టీ కండువాలను మెడలో వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్ సొంతపార్టీ నేతలను మోసం చేశారన్నారు. వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారన్నారు. జగన్ కోసం కష్టపడి పనిచేసిన నాయకులను అవమానించడంతో వారు రాష్ట్ర అభివృద్ధి కోసం వైసీపీకి గుడ్‌బై చెప్పి తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజలకు చేసిన వాగ్దానాలను, హామీలను నెరవేర్చకుండా జగన్ సొంత అజండాతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. తెలుగుదేశం పార్టీ ఒక మంచి ఆశయంతో పుట్టిన పార్టీ అని చెప్పారు. వైసీపీ అరాచక పాలన నుంచి బయటపడాలంటే రాష్ట్రానికి సమర్థవంతమైన నాయకత్వం కావాలన్నారు. మరలా రాష్ట్రాన్ని అభివృద్ధిపథం వైపు పయనించగలిగిన సత్తాగలిగిన చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. మార్టూరు గ్రామంలో భారీగా పార్టీలో వైసీపీ నాయకులు చేరడంపై రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వం అనడానికి నిదర్శనమన్నారు. కలిసికట్టుగా పనిచేసి పర్చూరులో అత్యధిక మెజారిటీని సాధించడానికి అందరం సమన్వయంతో పనిచేసి ముందుకు వెళదామన్నారు.


ఏలూరి సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరిన కోనంకి వాసులు

సైనికునిలాగా పార్టీ కోసం పనిచేస్తా..

పర్చూరు నియోజకవర్గంలో మూడోసారి ఏలూరి సాంబశివరావు భారీ మెజారిటీతో గెలిచి చరిత్ర సృష్టిస్తారని పార్టీలో చేరిన మాజీ సొసైటీ అధ్యక్షుడు తగెడ్ల అంజనేయులు అన్నారు. కొన్నికారణాలవల్ల టీడీపీని వీడి వెళ్లానని చెప్పారు. అయితే, వైసీపీ అరాచక, అసమర్థ, అవినీతి ప్రభుత్వంలో ఇమడలేకపోయానని అన్నారు. నీతి నిజాయతీ గలిగిన తెలుగుదేశం పార్టీలో ఏలూరి సాంబశివరావు వెంట సైనికునిగా పని చేయాలనే లక్ష్యంతో పార్టీలో చేరినట్టు చెప్పారు. ఆదరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆయనతో పాటు పార్టీలో చేరిన వారిలో పొనపల్లి శ్రీనివాస్, పసుమర్తి శ్యాంకుమార్, గోపనబోయిన చినవెంకటేశ్వర్లు, అట్లూరి రత్నం, నువ్వుల శ్రీనివాసరావు, నువ్వుల నాగేశ్వరరావు, పచ్చవ శ్యామ్, తన్నీరు శ్రీనివాసరావు, సయ్యద్ బాజి సుభాని, పాల్, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సలగల రాజశేఖర్, కామినేని జనార్దన్, షేక్ రజాక్, తాటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కోనంకిలో వైసీపీకి షాక్

మార్టూరు, ఏప్రిల్ 5: మండలంలోని కోనంకి గ్రామానికి చెందిన వైసీపీ నేతలు శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామంలో ఉప్పలపాటి శ్రీనివాసరావుకు చెందిన నివాస గృహంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు సమక్షంలో వైసీపీ నేతలు పార్టీలో చేరారు. వారందరికీ ఏలూరి పార్టీ కండువాలను మెడలో వేసి సాదరంగా స్వాగతించారు.

పార్టీలో చేరిన వారిలో మందపాటి శ్రీధర్, కొర్రపాటి కిషోర్, కొర్రపాటి కృష్ణ, తదితరులు ఉన్నారు. మాజీ డెయిరీ చైర్మన్, వైసీపీ నేత ఉప్పలపాటి చెంగలయ్య సోదరుడు మోహనరావు కుమారుడు శ్రీనివాసరావు కూడా పార్టీలో చేరారు.


మాజీ సొసైటీ అధ్యక్షుడు తగెడ్ల అంజనేయులును పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు

కార్యక్రమంలో టీడీపీ నేతలు కోటపాటి సురేష్, ఉప్పలపాటి చక్రపాణి, కొర్రపాటి కాజారావు, తొండెపు ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పర్చూరులో విస్తృత ప్రచారం

పర్చూరు, ఏప్రిల్ 5: పర్చూరులో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు గెలుపుకోసం పార్టీ శ్రేణుల ప్రచారానికి అనూహ్య స్పందన లభిస్తుంది. శుక్రవారం పర్చూరులోని పలు ప్రధాన కాలనీలు, గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, మామిడిపాక హరిప్రసాద్, కొల్లా శివరాంప్రసాద్, దీర్ఘాల రమేష్ నాయుడు, తోట మణి, తదితరులు పాల్గొన్నారు.

రూ.1.20 లక్షల నగదు స్వాధీనం

చినగంజాం, ఏప్రిల్ 5: చినగంజాం, ఉప్పుగుండూరు గ్రామాల మధ్య టోల్‌ప్లాజా సమీపంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసుల నిర్వహించిన వాహనాల తనిఖీల్లో శుక్రవారం రూ.1.20 లక్షల నగదు పట్టుబడింది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద చీరాల రూరల్ సీఐ ఎస్.సత్యనారాయణ, చినగంజాం ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది వాహనాలు తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఒంగోలు వైపు నుంచి చీరాల వైపునకు వెళ్తున్న హోండా కారులోని డ్యాష్ బోర్డులో నగదు ఉన్నట్లు గుర్తించారు. ఒంగోలులోని మంగమూరు రోడ్డుకు చెందిన గౌరాబత్తిన కరుణాకర్‌రావు, అతని భార్య కారులో వేటపాలెం మండలం రామన్నపేట గ్రామానికి వెళ్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కరుణాకరరావు ఒంగోలు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో ఉద్యోగం చేస్తున్నారని, ప్రస్తుతం సెలవులో ఉన్నట్లు తెలిపారు. రామన్నపేట గ్రామంలోని తన అత్తయ్య ఉమ్మిటి వెంకటరత్నం ఇంటి నిర్మాణం జరుగుతుందని, ఇంటి పనులు చేస్తున్న కూలీలకు డబ్బులు ఇచ్చే నిమిత్తం రూ.లక్షా 20 వేలు నగదు తీసుకొని వెళ్తున్నట్లు తెలిపారు. పట్టుపడిన నగదుకు సంబంధించి ఎటువంటి రసీదులు లేనందున, తదుపరి చర్యలు నిమిత్తం రూ.1.20 లక్షల నగదుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సీజ్ చేసిన నగదుని జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

చీరాల, ఏప్రిల్ 5: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమేనని వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక మరియమ్మపేట సమీపంలోని ఐటీసీ గ్రౌండ్‌లో శుక్రవారం యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన రెడ్ క్రికెట్‌బాల్ టోర్నమెంట్‌ను వెంకటేష్, మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో స్నేహపూర్వక పోటీతత్వం అలవడుతుందన్నారు. మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రతి ఓటు కీలకం: కొండయ్య

- 20 మత్స్యకార కుటుంబాలు టీడీపీలో చేరిక

చీరాల, ఏప్రిల్ 5: వచ్చే ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావుతో కలసి క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ కన్వీనర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ బూత్‌లవారీ అంశాలపై దిశానిర్దేశం చేశారు. పోలింగ్ పూర్తయ్యేవరకు రేపటి పని ఈ రోజే పూర్తి చేసేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అందుకనుగుణంగా శ్రేణులను సమన్వయ పరిచే విధి,విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం వేటపాలెం మండలం పందిళ్లపల్లి పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పెద్ద మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో కూటమి అభ్యర్థి కొండయ్య

మత్స్యకారులమంతా మీ వెంటే..

తామంతా మీ వెంటే ఉంటామని పలువురు మత్స్యకారులు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్యకు చెప్పారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం వాడరేవు గ్రామ టీడీపీ అధ్యక్షుడు బందు గురువయ్య ఆధ్వర్యంలో 20 కుటుంబాలకు చెందిన మత్స్యకారులు పార్టీలో చేరారు. ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ మన ఎన్నికల గుర్తు ఏంటని అడగ్గా వారంతా సైకిల్ అని చెప్పారు. ఇదే ఉత్సాహంతో ఎన్నికల వేళ పోలింగ్ పూర్తయ్యేవరకు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బూత్ కమిటీల బాధ్యులతో మాట్లాడుతున్న కొండయ్య

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

చీరాల, ఏప్రిల్ 5: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పెద్దపీట వేస్తుందని అభ్యర్థి కొండయ్య అన్నారు. స్థానిక పెద్ద మసీదులో శుక్రవారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు నాతాని ఉమామహేశ్వరరావు, కొండయ్య కుమారులు గౌరీ అమర్‌నాథ్, మహేంద్రనాథ్, మైనార్టీ సెల్ నాయకులు షేక్ యాసిన్, షేక్ మొహిద్దీన్, సయ్యద్ బాబు, రబ్బానీ, హలీం, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ముస్లింలు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు జగ్జీవన్‌రామ్

పంగులూరు, ఏప్రిల్ 5: సామాజిక సమానత్వం కోసం అలుపెరగని సమరం సాగించిన రాజకీయ, సామాజిక విప్లవయోధుడు జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయురని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలోగల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పేదలు, శ్రామికులు, అణగారిన వర్గాలకు సామాజిక, ఆర్థిక సమానత్వం అందించేందుకు జగ్జీవన్‌రామ్ చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో వరపర్ల సుబ్బారావు, మందా నాగేశ్వరరావు, మందా ఆమోస్, పూనూరి నరేంద్ర, కుక్కపల్లి ఏడుకొండలు, మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

చీరాల: జగ్జీవన్‌రామ్ నేటితరం నాయకులకు, యువతకు ఆదర్శప్రాయులని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక ముక్కోణపు పార్కు సెంటర్లోని బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంఘాల ప్రతినిధులు ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ నాయకులు, కార్యకర్తలతో కలసి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.సురేష్, నీలం శామ్యూల్‌మోజెస్, అలీంబాబు తదితరులు కూడా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలు సంఘాల ప్రతినిధులూ నివాళులు అర్పించారు.


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించిన వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు


జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పిస్తున్న కూటమి అభ్యర్థి కొండయ్య, నాయకులు, కార్యకర్తలు

స్వాతంత్ర్య సమరయోధునిగా భారత ఉపరాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలు అందించిన బాబూ జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడని మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా స్థానిక ముక్కోణపు పార్కు సెంటర్లోని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు.

ఇంకొల్లు: ఇంకొల్లులో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక సినిమాహాల్ సెంటర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బేతపూడి సురేష్‌బాబు, వలేరు మార్కు, పాలేరు రామకృష్ణ, రవిచంద్ర, హనుమయ్య, ఎమ్మార్పీఎస్ నేత పల్లెపోగు నాని, బాబు, క్రాంతి పాల్గొన్నారు.


జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

బల్లికురవ: జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని నక్కబొక్కలపాడు ఎస్సీ కాలనీలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే, బల్లికురవ మండల కేంద్రంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు కందుకూరి పేతూరు మాదిగ, కొంద్రు చిన్న సురభి ప్రభాకర్, కొండేటి ఇజ్రాయల్, సర్పంచ్ పందిరి అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్: దళితుల హక్కుల కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని ఏపీపీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నక్కా కాంతారావు అన్నారు. శుక్రవారం జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జి.శ్యాంసన్, టి.బాబురావు, జోసెఫ్, కోటేశ్వరరావు, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు: జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం మండలంలో ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలంలోని నాగులపాలెం గ్రామంలో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో కొల్లా శ్రీనివాసరావు, అడ్డగడ్డ రామకృష్ణ, అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, గన్నపనేని నాని, పోట్రు శోభన్, దాసి కిరణ్, నాగరాజు, సుమన్, లక్కిపోగు సుమన్, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని బైకిస్టు మృతి

మార్టూరు, ఏప్రిల్ 5: మార్టూరులో ఇండియన్ పెట్రోలు బంకు ఎదురుగా జాతీయ రహదారిపై శుక్రవారం బైకును వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు నల్లచెర్ల వేమలయ్య (35) మృతి చెందాడు. మృతునికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు చిలకలూరిపేట మండలం గోవిందపురం గ్రామానికి చెందినవాడు. అతను చిలకలూరిపేటలోని ఓ పెట్రోలు బంకులో పని చేస్తున్నాడు. గురువారం భార్య పుట్టిల్లు అద్దంకికి కుటుంబంతో వెళ్లాడు. శుక్రవారం డ్యూటీ నిమిత్తం అద్దంకి నుంచి ఒక్కడే ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేట వెళుతున్నాడు. ఈక్రమంలో నెల్లూరు నుంచి గుంటూరు వైపు వేగంగా వెళుతున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. కారు కొంతదూరం ద్విచక్రవాహనాన్ని ఈడ్చుకుపోయింది. రోడ్డుపక్కన డివైడర్ పైకి కారు ఎక్కింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన వేమలయ్య తలకు తీవ్రగాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి బాధితుడ్ని 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతనిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని భార్య మధుమతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి సాయంత్రం పోలీసులు శవపంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఏఎస్‌ఐ మహబూబ్ బాషా తెలిపారు.

వ్యాపారి ఆత్మహత్య

సంతమాగులూరు, ఏప్రిల్ 5: మండలంలోని పుట్టావారిపాలెం అడ్డరోడ్డులోని ప్రమీళాసీడ్స్ యజమాని చిరుమామిళ్ళ సురేంద్ర గురువారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడ్డారు. షాపులో పనిచేసే గుమస్తా ఉదయం వచ్చేసరికి పురుగుమందు సేవించి అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. గమనించిన గుమస్తా కుటుంబ సభ్యులకు సమాచారం అందించి నర్సరావుపేట వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. సురేంద్ర మృతికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సురేంద్ర స్వగ్రామం సంతమాగులూరు మండలంలోని మిన్నెకల్లు గ్రామం. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సురేంద్ర మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు.

కొప్పెరపాలెంలో 13 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు

బల్లికురవ, ఏప్రిల్ 5: మండలంలోని కొప్పెరపాలెంలో శుక్రవారం పత్తిపాటి దావీదు అనే రైతుకు చెందిన 13 గొర్రెలు మృతి చెందాయి. అందిన సమాచారం మేరకు.. ఎస్సీ కాలనీకి చెందిన దావీదు గొర్రెల ద్వారా జీవనం సాగిస్తున్నాడు. గత రెండు రోజుల నుంచి గొర్రెల మందలో ఉన్న 13 గొర్రెలు సీజనల్ వ్యాధుల బారినపడి మృతి చెందాయి. దీంతో బాధిత గొర్రెల యజమాని లబోదిబో మంటూ పశువైద్యులను సంప్రదించారు. గొర్రెలకు సీజనల్‌గా ఏదైన జ్వరం లాంటిది వచ్చి ఉంటుందని, అందువలనే మృతి చెంది ఉంటాయని పశువైద్యులు తెలిపారని గొర్రెల యజమాని తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని అయన కోరారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి

కారంచేడు(పర్చూరు), ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బత్తుల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కారంచేడు మండలంలోని స్వర్ణ, కేశవరప్పాడు, స్వర్ణపాలెం, కొడవలివారిపాలెం, దగ్గుబాడు, తిమిడితపాడు గ్రామాల్లో ప్రత్యేక పోలీస్(బీఎస్ఎఫ్) బృందాలతో కవాతు నిర్వహించారు. అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రశాంత వాతావణంలో ఎన్నికలు నిర్వహించటమే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం గ్రామాల్లో పటిష్ఠ భద్రతను కల్పిస్తున్నట్లు చెప్పారు. అందులోభాగంగా ఇప్పటికే ఇంకొల్లు సర్కిల్ పరిధిలో పలుసమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో కారంచేడు పోలీసు స్టేషన్ సిబ్బంది, ప్రత్యేక పోలీసు బృందం పాల్గొన్నారు.

విద్యార్థుల విహార యాత్ర


కొత్తపట్నం బీచ్ వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

అద్దంకి, ఏప్రిల్ 5: ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు విహార యాత్రకు వెళ్ళి ఆనందంగా గడిపారు. అద్దంకి మండలంలోని విప్పర్లవారిపాలెం, కొరిశపాడు మండలంలో బొడ్డువానిపాలెం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు శుక్రవారం కొత్తపట్నం బీచ్‌కు విహారయాత్రకు వెళ్లారు. రెండు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కూకట్ల సుబ్బారావు, అనూరాధ, ఉపాధ్యాయులు శాంతకుమారి, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి విహారయాత్రకు వెళ్లారు. అల్లూరులోని సాయిబాబా స్తూపం, కొత్తపట్నంలోని చిన్మయ ధ్యాన మందిరం, బీచ్ తదితర ప్రాంతాలలో ఆహ్లాదంగా, ఆనందంగా గడిపారు.

25 ఎకరాలలో జామాయిల్ తోటలు దగ్ధం


ఉప్పలపాడులో దగ్ధమవుతన్న జామాయిల్ తోటలు

అద్దంకి, ఏప్రిల్ 5: జామాయిల్ తోటలకు నిప్పంటుకొని సుమారు రూ.30 లక్షల నష్టం వాటిల్లింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని ఉప్పలపాడులో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో జామాయిల్ తోటలకు నిప్పు అంటుకుంది. సాయంత్రం 4 గంటల సమయంలో గ్రామస్థులు మంటలను గమనించి వెళ్ళి సుమారు 2 గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చేసరికి సాయంత్రం 6 గంటలు అయింది. దివికోలు రాధాకృష్ణమూర్తితో పాటు మరో పది మందికి చెందిన 25 ఎకరాలలో జామాయిల్‌తో పాటు నీటి పైప్‌లైన్ సామగ్రి దగ్ధమయ్యాయి. మంటలు ఎలా అంటుకున్నాయన్న విషయమై స్పష్టత లేదు. సుమారు రూ.30 లక్షల ఆస్తి నష్టం వాటిల్లటంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

ఉప్పలపాడులో జామాయిల్ తోటలు దగ్ధమైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బాధిత రైతులకు ఫోన్‌చేసి మాట్లాడారు. ఆస్తి నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు.

ఆటోను ఢీకొన్న లారీ.. డ్రైవర్‌కు గాయాలు

అద్దంకి, ఏప్రిల్ 5: ఆటోను ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొనటంతో ఆటో డ్రైవర్ కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కొండలరాయునిపాలెంకు చెందిన అజీంబాషా తన ఆటోతో చిలకలూరిపేట బాడుగకు వెళ్లారు. తిరిగి వచ్చేక్రమంలో శుక్రవారం సాయంత్రం మండలంలోని కలవకూరు పంచాయతీ పరిధిలోని గుర్రంవారిపాలెం వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈప్రమాదంలో ఆటోడ్రైవర్ అజీం బాషాకు తీవ్రగాయాలు కావటంతో 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రయివేట్ వాహనంలో వినుకొండ వైద్యశాలకు తరలించారు.

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 5: వేటపాలెం మండలంలోని పలుగ్రామాల్లో శుక్రవారం డీఎస్పీ బేతపూడి ప్రసాద్ ఆదేశాల మేరకు, రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ సూచనలతో ఎస్సై సురేష్, స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై సురేష్ చెప్పారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

పర్చూరు, ఏప్రిల్ 5: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆరోగ్యం కుదుటపడాలని శుక్రవారం జనసేనులు పర్చూరులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. త్వరగా కోల్కొని ఎన్నికల ప్రచారం చేపట్టాలని కోరుతూ జనసేనాని నలతోటి సుధాకర్ ఆధ్వర్యంలో స్థానిక నేతాజీ వృద్ధాశ్రయంలోని వృద్ధులకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.